

# తాడూ - బొంగరం

అంత తెలివిగలదనుకున్న సుబ్బులక్ష్మి, హఠాత్తుగా అంత పెద్ద ప్రమాదంలో చిక్కుకోవటం చూసేసరికి సుందరి నిలువునా నీరైపోయింది.

'అందంలో అది మనకు యీడు కానట్టే, తెలివితేటల్లో దానికి మనం యీడు కాము. చూస్తూం డండి. అది పెద్ద చేపనే బుట్టలో వేస్తుంది!' అన్నది సుందరి ఒక రోజున సేతుబాయి, సరోజ, రాధల్తో. ఆ ముగ్గురు కూడా సుందరితో ఏకీభవించారు. నెల తిరక్కముందే సుబ్బులక్ష్మి, సుందరితో తనకు చిక్కిన చేప సంగతి చెప్పి, ఫోటో కూడా చూపించింది.

సుందరితోపాటు సేతుబాయి, సరోజ, రాధ కూడా ఆ ఫోటో చూసి ఆశ్చర్యంతో 'ఔరా!' అనుకున్నారు. మకరాంకుడూ, శశాంకుడూ కాకపోయినా, మనిషి యింత జబ్బ పుష్టీ, బుష్‌కోటూ నదరుగానే కనిపించాడు.

'మరి ఆ అబ్బినేం చేస్తావ్?' అని అడిగింది సుందరి. అందులో రహస్యం, దాపరికం ఏమీలేదు!

'నేను యితగాణ్ని పెళ్ళిచేసుకోబోతుంటే, ఆ అబ్బిగాడి సంగతి నాకేం పట్టింది? అంత వదలకపోతే వాళ్లూ వాళ్లూ చూసుకుంటారు' అంటూ నవ్వింది సుబ్బులక్ష్మి.

సుబ్బులక్ష్మి అన్నదంతా అక్షరాలా నిజమైంది. ఆ 'అబ్బి' యీ చేప చేతుల్లో ఓ రాత్రివేళ పడి అవతారం చాలించాడు. ఆ సమయంలో సుబ్బులక్ష్మికూడా అక్కడే వుంది. ఆమె నిజమైన హిందూ పతివ్రతలా, చేసుకున్న వాడివైపే మొగ్గు చూపింది. ఆ 'అబ్బి' కీచకుడని కూడా తాళి కట్టిన వాణ్ని నమ్మించింది. లేకపోతే అతగాడు అంత దుస్సాహసం, తెగింపూ చేసి వుండకపోను. కాని న్యాయచట్టం కీచక వధానంతరం సుబ్బులక్ష్మినీ, పవన నందనుణ్నీ (అతడి పేరు భీమారావు,

అయ్యో ఖర్మ!) ఇనప కమ్మల వెనక బంధించింది.

ఈ సంఘటన అందరికన్న సుందరికి పెద్ద షాక్‌లా తగిలింది.

ద్రౌపది అపరావతారం అని ఒకటికి నాలుగుసార్లు సుబ్బులక్ష్మిని మెచ్చుకున్న సేతుబాయి మాత్రం 'యిలా జరుగుతుందని నేననుకుంటూనే వున్నాను!' అనేసింది, అతి తెలివిగా.

సుందరి తప్ప తతిమ్మా స్నేహితురాళ్ళందరూ సుబ్బులక్ష్మి నెత్తిన యింత దుమ్ము పోశారు. 'సుబ్బులక్ష్మిని చూస్తే నాకెప్పుడూ ఒక పాట గుర్తుకొస్తూండేది. మా వూళ్లో ఒక సర్కస్ సాయిబు పాడాడు. 'వాణ్ణి రమ్మన్నాది, వీణ్ణి రమ్మన్నాది....యిద్దర్ని రమ్మనీ...' అదీ పాట. దాని విర్రవీగుడికి తగిన శాస్తే జరిగింది' అన్నది రాధ.

సుందరి ఏమీ మాట్లాడలేదు. సేతుబాయి, సరోజ మాత్రం చిన్న చిరునవ్వు నవ్వి వూరుకున్నారు.

ఈ దుర్ఘటన జరిగింతర్వాత సుందరి బాగా మారిపోయింది. అడ్డమైన వాణ్ణల్లా ఆకర్షించాలను కోవటం శుద్ధ వెర్రితనం అన్న అభిప్రాయాని కొచ్చింది. కీచకవధ సమయంలో భీమారావు తన అర్ధాంగి అయిన సుబ్బులక్ష్మిని కూడా పక్కన నిలబడేట్టు చేయగలిగాడంటే - అతగాడు సుబ్బులక్ష్మికన్న తెలివైనవాడనేందుకు సందేహంలేదని కూడా ఆమె నిశ్చయించుకున్నది.

సుబ్బులక్ష్మి తనకంటె తెలివిగలవాణ్ని చేసుకుని పెద్ద తప్పు చేసింది. తనకంటె తెలివితేటల్లో తక్కువవాణ్ని చేసుకుని వున్నట్టయితే - యిలాంటి ప్రమాదం రాకుండానే కార్యం సానుకూలం చేసుకునే పని.

సుందరి యిలాంటి ఆలోచనల్తో కుస్తీపట్లు పడుతున్నప్పుడే చంద్రశేఖరం ఆమెకు పరిచయ మయ్యాడు. ఆ పరిచయమయిన తీరు అనితర దుర్లభం, అపూర్వం కూడాను.

'నన్ను చూడు, నా అందం చూడు' అనే రకం మనిషి సుందరి. నడకలో కనబరిచే నడుం వొంపులూ, మెడ విరుపులూ, జడ కుదుపులూ - మగాణ్ని యిట్టే ఆకర్షిస్తాయి. ఇక మాట కలి పిందో నడిరోడ్డు మీద అయినా పడకగదిలో కనబరిచేంత సిగ్గూ, మురిపెము కనబరచగలదు. 'చూస్తావేం?' అన్నట్టుంటుంది ఆమె మాట తీరూ, కంటిచూపూ.

జైల్లో ఒకటి రెండుసార్లు సుబ్బులక్ష్మితో మాట్లాడింతరువాత సుందరిలో కాస్తంత నిండుతనమూ, నిబ్బరమూ ప్రవేశించాయి. 'నా అవస్థ చూశావుగదా? కాస్త ఒళ్లు స్వాధీనంలో ఉంచుకో' అని కూడా సుబ్బులక్ష్మి సలహా ఇచ్చింది. కాని సుందరికి స్వాధీనంలో లేంది వొళ్లు కాదు - మనసు. ఆ సంగతి పాపం సుబ్బులక్ష్మికీ, సుందరిక్కూడా తెలీదు.

చంద్రశేఖరం, సుందరికి సినిమా హాల్లో తారసపడ్డాడు. త్రి.డి. పిక్చరు చూస్తుండగా, సుందరి వెనుక కుర్చీలో కూర్చున్న శేఖరం, పిక్చర్లో కర్రో, కత్తో విసిరినప్పుడల్లా ముందున్న సుందరి కుర్చీ పట్టుకోబోయి, ఒకటి రెండుసార్లు ఆమె జడ అంది పుచ్చుకొన్నాడు.

సుందరి చీకట్లో ఆ విధంగా జడ పట్టుకున్నది ముసలాడో, పడుచోడో తెలీక కాస్త మధనపడుతూం డగా లైట్లు వెలిగినై. వెనక్కి తిరిగిచూస్తే శేఖరం ముఖం యింత చేసుకుని 'క్షమించండి' అన్నాడు.

మనిషి కాస్త ఎర్రగా పుల్లగా కనబడేసరికి సుందరి స్థిమితపడి పోయింది. చిరునవ్వు కూడా

నవ్వింది.

'భర్త అనేవాడు వున్నట్టయితే, మీరు చేసిన పనికి....' అంటూ అదోలా కళ్లు తిప్పింది సుందరి.

తనకు యింకా పెళ్ళి పెటాకుల్లాంటివి కాలేదనీ, మెడకేం పలుపు లేదనీ సూచించటం సుందరికి బాగా అలవాటు.

తెలివిగా మాట్లాడాననుకున్న సుందరి మాటల్లోని వెకిలితనం శేఖరం యిట్టే గ్రహించాడు. పైగా తను మాటలు రాని అమాయకుడని కూడా ఆమె అనుకుంటున్నట్టు అతడికి తోచింది.

పిక్చరయిపోయింతరవాత, హాలు బయటికి రాగానే శేఖరం, అతితెలివిగా తనూ బ్రహ్మచారినేనని సుందరికి వెల్లడించాడు. అంతేకాక ఆమె అందచందాలు చూసి తను కిందుమీదయి పోతున్నట్టు కూడా గుటక వేశాడు.

సుందరి తల గిర్రున తిరిగిపోయింది. తన సౌందర్యం చూసి నిట్టూర్చే మగాళ్ళల్లో మరోడు చేరాడని ఆమె ఊహించింది. పైగా మనిషి అమాయకుడులా, భయస్తుడులా కూడా కనిపించాడు. దుస్తుల తీరు చూస్తే బాగా డబ్బున్న మనిషనిపించిందావిడకు.

'ఇంట్లో మా తాతయ్యా, నేనూ! ఆయన తహసీల్దార్ చేసి రిటైరయ్యాడు' అని చెప్పింది సుందరి. శేఖరం, సుందరి వెకిలి మనిషని గ్రహించినా అది బయట పడనీకుండా, తనకు వున్న ఆస్తిపాస్తులూ, మద్రాసులో స్నేహితుడ్ని కలుసుకునేందుకు తను ఎప్పుడొచ్చిందీ - అలాంటి వివరాలన్నీ ఏకరుపెట్టాడు.

ఇద్దరు చెట్‌పట్ పోస్టాఫీసు వైపుకే వెళ్ళాలని తెలుసుకున్న తరవాత శేఖరం తెచ్చిన టాక్సీలో సుందరి ఎక్కికూచునేందుకు అభ్యంతరం ఏమీ చెప్పలేదు.

టాక్సీ కుదుపుల్లో శేఖరం స్పర్శ తగిలినప్పుడల్లా అతగాడు చలిజ్వరం తగిలినవాడులా వణికి పోతున్నాడని సుందరి వూహించింది. పాపం, అది ఆమె మనస్సు కల్పించుకుంటున్న ఊహాచిత్రమని ఆమెకు తెలీదు. వీలైతే యీ పక్షిని పంజరంలో పెట్టాలని కూడా ఆమె అనుకున్నది. డబ్బున్న వాడూ, అమాయకుడూ, భయస్తుడూ...సుబ్బులక్ష్మి చేసిన పొరపాటు తను చేయకూడదు. భీమారావు తత్వానికి వ్యతిరేక తత్వం. 'అబ్బి'గాళ్ళందర్నీ 'స్నేహితులు' అని చెప్పేస్తే సరిపోతుంది!

'ఇదే మా యిల్లు. టీ కాగుతోంటుంది. మీ కభ్యంతరం లేకపోతే....' అన్నది సుందరి టాక్సీ దిగి ఒళ్లంతా విరుచుకుంటూ.

శేఖరం అలాంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్నాడు. కాని భయం నటిస్తూ - 'మీ తాతయ్య?' అంటూ గొణిగాడు.

'ఆయనదేం లేదు. చెముడూ, చూపానదు. పైగా నిదరపోతూంటాడు' అన్నది సుందరి.

ఆ చొరవా అదీ ప్రబంధనాయకి అనిపించింది శేఖరానికి.

తాళం తీసి తలుపు తోసేసరికి లోపల గదిలో నుంచి సన్నని దగ్గు వినిపించింది. ఆ వెంటనే 'ఎవరూ?' అన్న బొంగురు గొంతు కూడా ధ్వనించింది.

'నేనే తాతా' అన్నది సుందరి.

శేఖరం గుండెలు దడదడలాడినై, గదిలోంచి ఆ తాతయ్యా బయటికివచ్చి తనని చూస్తాడేమో అని.

టీ యింత, కప్పులో పోసి యిస్తూ, 'మన పరిచయం చాలా తమాషాగా అయింది గదూ?' అని నవ్వింది సుందరి.

'దేవుడే మనని కలిపాడనుకుంటాను – ఆ త్రి.డి. సినిమా ద్వారా!' అన్నాడు శేఖరం.

'ఎవరే అమ్మాయ్ ఆ మాట్టాడేదీ?' అన్న ప్రశ్న గదిలోంచి బయటపడింది.

'మన రామనాథం తాతా! ఇవ్వాళే బెజవాడ నుంచి వచ్చాడు' అనేసింది సుందరి నదురూ బెరుదూ లేకుండా.

'రామనాథమా?' అంటూ తాత మంచం కిర్రుమనిపించి, వణుకుతూ గదిలోంచి బయటికి వచ్చాడు.

సుందరి తెల్లబోయింది. శేఖరం గతుక్కుమన్నాడు.

'మీ నాయన కులాసారా బాబూ?' అని ప్రశ్నించి ఠక్కున ఆగిపోయాడు తాత.

తాతకేదో అనుమానం కలిగిందని శేఖరం గ్రహించి, తడుముకోకుండా, 'ఆ బాగానే వున్నాడు. నిన్ను అడిగానని చెప్పమన్నాడు,' అనేశాడు.

సుందరి ఆశ్చర్యపోయింది. ఇతగాడు తెలివిగలఘటమే అన్న భయం కలిగిందామెకు.

'గొంతు కూడా గుర్తుపట్టలేనంతగా మారిపోయిందే! ఏళ్ళు పైబడిన కొద్దీ మనిషి పెరగవలసింది పోయి, పొట్టి అయిపోతున్నాడు! రామనాథమేనటే అమ్మాయ్?' అన్నాడు తాత మరింత దగ్గిరకొస్తూ.

'అవును తాతా! రామనాథమే' అన్నది సుందరి కాస్త కళవెళపడుతూ.

శేఖరం కూడా కొంచెం అదిరిపడ్డాడు.

'గొంతుదేముందిలే తాతా, యీ మధ్య కణితి లేస్తే ఆపరేషన్ చేయించాను. మనిషిని పెరగలేదు గాని, పొట్టి కావడమేమిటి? అమ్మ కూడా వచ్చేటప్పుడు, నీ ఆరోగ్యం సంగతీ అదీ అడిగి రమ్మన్నది' అన్నాడు శేఖరం.

'అమ్మ!' అంటూనే తాత ముఖం కందగడ్డలా చేసుకున్నాడు – 'ఎవడే వీడు? వెధవ సజ్జునంతా యింట్లో చేర్చవద్దని చెప్పలేదా? ఛో, నా యింట్లోనించి' అంటూ తాత కోపంతో వణికిపోతూ శేఖరం మీదికి వచ్చాడు.

శేఖరం తను చేసిన పొరపాటు గ్రహించాడు.

'భలే హడావిడిలే తాతయ్యా! ఆ మధ్య ఏదో దోషం పోయేందుకు, అమ్మ చనిపోయినట్టు రాశాం. అదంతా మా పౌరోహితుడు చేసిన పని. మీరు నిజమే అనుకున్నారన్నమాట?' అంటూ నవ్వాడు.

తాత గతుక్కుమన్నాడు. సుందరి నివ్వెరపోతూ శేఖరంకేసి చూసింది.

'అయితే నువ్వు రామనాథానివే అన్నమాట! ఏదో పెద్దతనం...చూపు కూడా అంతగా ఆనడం లేదు. మరేం అనుకోకురా అబ్బాయ్!' అని వెనుదిరిగాడు తాత.

'నీ ఉబ్బసం సంగతి ఎలా ఉంది తాతా? కనుక్కోమన్నది అమ్మ!' అన్నాడు శేఖరం.

'ఉబ్బసమా?' అంటూ తాత మళ్ళీ అనుమానంగా చూస్తూ వెనుదిరిగాడు.

'అదే...అది....దగ్గూ, కంటిచూపు సంగతి. మా అమ్మ ఎప్పుడూ అంటూండేది... పెద్దతనం... ఒక్కగానొక్క మనమరాలు పాపం!' అని అన్నాడు, శేఖరం తను చేసిన పొరపాటు గ్రహించి.

తాత ఒక్క క్షణకాలం పస్తాయించి, 'ఏదో అంతా అయోమయంగావుంది. నేను రివిన్యూ యినస్పెక్టరు చేసే రోజులూ, ఆ ఓపికా...ఏమిటో....నాకేం తెలియటం లేదు. సరే, మీ అమ్మనీ, నాన్ననీ అడిగానని చెప్పు. ఉంటే పగలెప్పుడైనా కనబడు!' అంటూ తాత గదివైపుకు నడిచాడు.

తన తెలివితేటలకూ, సమయస్ఫూర్తికీ తన్మయం చెందిన శేఖరం పక్కకు తిరిగి సుందరికేసి చూసేసరికి జావ అయిపోయాడు. ఆమె ముఖాన కోపం, పెదాల బిగింపు చూసి శేఖరం నోటంట మాట రాలేదు.

'తక్షణం, ఫో, బయటికి! ఊఁ' అన్నది సుందరి పళ్ళు కొరుకుతూ.

'ఏం చేశాను? ఎందుకూ?' అన్నాడు శేఖరం అర్థంకాక తడబడుతూ.

'మీరంతా ఒకటే రకం. అమాయకుల్లా నటించి, ఆడపిల్లల్ని వలలో వేసుకుంటారు. నువ్వు అమాయకుడివీ, భయస్తుడివీ అనుకున్నాను. ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే రకం. ఫో, బయటికి!' అని రెట్టించింది సుందరి.

శేఖరానికి ఆమె మాటల్లోని అర్థం ఏమిటో అవగాహన కాలేదు. తను తెలివిగలవాడూ, ధైర్యస్తుడూ అయితే ఆమె మరింతగా ప్రేమించాల్సింది పోయి, యీ ఈసడింపేమిటి? అనుకున్నాడు.

'అయితే నీకు చచ్చువెధవ అయితే తప్ప పనికిరాదన్నమాట?' అన్నాడు శేఖరం కాస్తంత కోపంగానే.

'ఫో, బయటికంటూంటే' అంటూ ముందు కొచ్చింది సుందరి – 'నీ బోటి అతితెలివిగాళ్ళంటే నాకు మంట. వారం రోజుల్లో మా చరిత్ర తిరగ తవ్వుతారు. మీ విరోధాలకీ, వుక్రోషాలకీ మేం బలికావాలి. పాపం, సుబ్బులక్ష్మి!' అన్నది సుందరి నిస్పృహగా.

శేఖరానికి కథ అర్థమైపోయింది. పత్రికల్లో తాటికాయంత అక్షరాలతో పడిన భీమారావు, సుబ్బులక్ష్మల కేసు యావత్తూ అతడు క్షుణ్ణంగా చదివాడు.

'అయ్యో, సుందరీ!' అంటూ చేతులు పైకెత్తి, పెదాలు చప్పరించాడు శేఖరం – 'ఇదా నీ భయం! నేను నీకు తాళి కడతానని వచ్చాననుకున్నావా? అదేం లేదు. నన్నాకర్షించింది నీ వయసు! నీ వెకిలితనం చూసింతరవాత, అరచేతిలో ఆమలకం అనుకున్నాను. సరే, సుబ్బులక్ష్మికి నా అభివందనాలు చెప్పు' – శేఖరం తలాడించి వీధిలోకి వచ్చేశాడు.

'దొంగలు, అమాయకత్వం నటిస్తారు. ఛీ!' అంటూ సుందరి దభాలున తలుపులు గడివేసుకున్నది.

❋

*(అభిసారిక మాసపత్రిక : 1940-49)*